క్లుప్తంగా

చెరువులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులోని మలి పెద్దివాని కోనేరు ఆక్రమణలకు గురైనట్లు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు ఇటీవల జిల్లా స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసిన అధికారులు గురువారం చెరువులో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. మొత్తం విస్తీర్ణం 2.69 ఎకరాలు కాగా, పొక్లెయినర్‌తో ఆక్రమలు తొలగించారు. ఇక్కడ త్వరలోనే ఉపాధి పనులు ప్రారంభం కానున్నాయి.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న స్థానికులు

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశం పంచాయతీలో తాగునీరు కలుషితమైందని, ఆర్వో ప్లాంట్ ద్వారా నీరు అందించాలంటూ గ్రామస్తులు గురువారం నిరసన వ్యక్తం చేవారు. స్థానికంగా ఉన్న వైశాఖి హేచరీస్ పరిశ్రమ వల్ల భూగర్భ జలాలు కలుషితమైనట్లు ఆరోపించారు. తక్షణమే పూర్తిస్థాయిలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాల కోరారు.

షిర్డీసాయి మందిరంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: అన్నంతోనే అనంతకోటికి జీవనమని శ్రీకాకుళం టూటౌన్ ఎస్ఐ వెలిచేటి సందీప్‌కుమార్ అన్నారు. గురువారం విశాఖ-ఏ కాలనీలోని షిర్డీసాయి మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా నారాయణసేవ సమితి ద్వారా అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. జిల్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, చైర్మన్ డాక్టర్ మధువిలేకర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకురావాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. పర్లాం మాకివలస గ్రామానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు అల్లు జయచంద్ర ప్రసాద్ తన తండ్రి గోవిందరావు జ్ఞాపకార్థం రూ.30వేల విలువైన క్రీడా పరికరాలు, దుస్తులను సమకూర్చారు. వీటిని శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వాలీబాల్ క్రీడాకారులకు గురువారం చీఫ్ కోచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్లాం మాకివలస గ్రామ సర్పంచ్ గుజ్జల వెంకటరావు, డీఎస్ఏ శాప్ వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు సాయం



సాయం అందిస్తున్న అభిమానులు

రణస్థలం: రణస్థలంకు చెందిన తరుణ్ కుమార్తె పుట్టినప్పటి నుంచే అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న రణస్థలం అల్లు అర్జున్ అభిమానులు గురువారం రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, అండమాన్ అల్లు అర్జున్ అభిమానులు పాల్గొన్నారు.

గొల్లపేటలో నేత్ర వైద్య శిబిరం

లావేరు: వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. గొల్లపేటలో గురువారం కంటి వెలుగు పథకంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

200 రోజుల వేడుక..

గడప గడపే వేదిక

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 200 రోజులు పూర్తి చేసుకున్న గడపగడపకు మన ప్రభుత్వం
- ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించిన ఎమ్మెల్యే కిరణ్
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వైనం



సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ఎచ్చెర్ల నియోజకవర్గంలో గత ఏడాది మే 11న తమ్మినాయుడుపేటలో ప్రారంభమైంది. నేటికి 200 రోజులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ప్రతి గ్రామానికి వెళ్లి ఇంటింటా తలుపుతట్టి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, అన్ని వర్గాల వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హతలు ఉండి పథకాలు అందకపోతే అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నియోజకవర్గంలో ఇలా..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో 100 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 77 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 66,271వేల గృహలకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జి.సిగడాం మండలంలో 21 సచివాలయాలకు గాను 19 సచివాలయాలలో పరిధిలో 14,887 గృహాలకు, లావేరులో 23 సచివాలయాలకు గాను 19 సచివాలయాల పరిధిలో 20414 గృహాలకు, ఎచ్చెర్లలో 28 సచివాలయాలకు గాను 18 సచివాలయాల పరిధిలో 15,166 గడపలకు, రణస్థలంలో 28 సచివాలయాలకు గాను 21 సచివాలయాల పరిధిలో 19455 గడపలకు వెళ్లి సంక్షేమం, అభివృద్ధిపై వివరిస్తూ గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనందంగా ఉంది..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గడపకు వెళ్లి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుంటున్నాం. లబ్ధిదారులంతా ఆనందంగా స్వాగతం పలుకుతున్నారు. సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నాం. ప్రజలతో మమేకం కావడం ఆనందంగా ఉంది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల నియోజకవర్గం

ట్రస్టు బోర్డు సేవలు అభినందనీయం



మంత్రికి శ్రీకూర్మనాథుని ప్రతిమను అందజేస్తున్న ఆలయ అర్చకులు

గార: శ్రీకూర్మనాథాలయ ట్రస్టు బోర్డు సేవలు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకూర్మనాథాలయంలో మంత్రి చొరవతో ప్రారంభమైన నిత్యాన్నదాన పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు భోజన వసతి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. దాతల సహకారంతో ఇటువంటి సమున్నత కార్యక్రమం ఏర్పాటు చేయగలిగామన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు చేస్తున్న కృషి సమర్థంగా ఉందన్నారు. భోజనాన్ని విసుగుతో కాకుండా ప్రేమతో అందించాలన్నారు. ఈ పథకానికి ఇప్పటివరకు రూ. 80 లక్షలు డిపాజిట్ జరిగిందని, మరికొందరు దాతలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఈవో గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, పాలకమండలి సభ్యులు డబ్బీరు శ్రీనివాస్, ముంజేటి అప్పలకొండ, బోర కృష్ణవేణి, అనుపోజు నాగరాజు, పూడి కమల, పొన్నాడ రుషి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం : కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గుచూపాలని చంద్రయ్యపేట ప్రధానోపాధ్యాయుడు పేకల రమేష్ కోరారు. గురువారం వెలగాడలో చిన్నారుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాల పనితీరు, బోధన, విద్యా సంబంధిత పథకాలు, మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్యను పొందాలంటే పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మక్క గంగేశ్వరి, రమణ, సతీష్, పద్మావతి, కోటేశ్వరావు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాహ్వానితుడు సాయికుమార్

రణస్థలం: రణస్థలం మండలాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పని చేయాలని మండల ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజిని అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, లోవోల్టేజీ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విన్నవించా. జెడ్పీటీసీ టొంపల సీతారాం మాట్లాడుతూ అర్హత కలిగినా 40శాతంలోపు దివ్యాంగత్వ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నందున పింఛన్‌కు అర్హత కోల్పోతున్నారని తెలిపారు. మండల కేంద్రంలోనే సర్టిఫికెట్ల జారీ సెలక్షన్ ఉండేలా తీర్మాం చేయాలని కోరారు. ఎంఈవో ఎ.త్రినాథరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2023–24 సంవత్సరానికి సంబంధించి పుస్తకాలు, దుస్తులు, జగనన్న విద్యా కానుక సామగ్రి వచ్చేశాయని చెప్పారు. సీఎస్‌డీటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఐదు పౌరసరఫరాల డిపోలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలని కోరారు. పైడిభీమవరం పంచాయతీ దేవునిపాలవలస రెవెన్యూలో చెరువులు, గెడ్డల్లో ఆక్రమణలు తొలగించాలని సర్పంచ్ సింక భవాని ఎంపీడీఓ ధనుంజయరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, స్పెషల్ అధికారి బి.దుర్గారావు, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకం.. అదే జగనన్న లక్ష్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రతి ఇంటికీ పథకం అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. వాండ్రంగి సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. 350 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ జగనన్నకు అండగా నిలిచి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, ఇ.గోవిందరావు, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, డీసీఎంస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, సర్పంచులు చిత్తిరి మోహన్, బుడారి లక్ష్మణరావు, భూపతి సురేష కుమార్, తొత్తడి రామారావు, పేడాడ శ్రీరామమూర్తి, పిల్లల శివకుమార్, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఏఈఈలు మహాదాసం రమేష్, శ్రీవల్లి, కె.తిరుపతిరావు, బగాది భాగ్యలక్ష్మి, ఏపీఎం రెడ్డి రామకృష్ణం నాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడుకులా..



నా వయస్సు 85 ఏళ్లు. జగన్‌బాబు పింఛన్ మంజూరు చేసి పెద్దకు కొడుకులా ఆదుకుంటున్నాడు. ప్రభుత్వ మేలు మరువలేను.

– పొగిరి వరహాలమ్మ, వాండ్రంగి

జాబ్‌మేళాలో 186 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు, ప్లేస్‌మెంట్ అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గీతం డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 186 మంది ఎంపికయ్యారు. మొత్తం 236 మంది యువత హాజరుకాగా 11 సంస్థలు హాజరై అర్హతలు కలిగిన విద్యార్థులను ఎంపికచేశారు. కార్యక్రమంలో గీతం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.రమేష్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కేపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 432 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసీ ఆఫీసుకు సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో సత్తాచాటారని విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి అన్నారు. కళాశాలలో ప్రముఖ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 432 మంది కొలువులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. వీరిని గురువారం ప్రిన్సిపాల్ శివశంకర్‌తో కలిసి అభినందించారు. విద్యార్థులకు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: 33/11 కేవీ ట్రాన్స్‌ఫార్మ్ మరమ్మతుల నేపథ్యంలో కుశాలపురం, నవభారత్ పారిశ్రామిక వాడ, కేశవరావుపేటల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



గార: వలంటీరును సన్మానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



లావేరు: తామాడలో వలంటీర్లను సన్మానించిన ప్రజాప్రతినిధులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వలంటీర్లతో మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి

గార: వలంటీర్ల సేవలు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం గార మండలం గొంటి, రామచంద్రాపురం, వాడాడ సచివాలయ పరిధిలోని వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా సేవలందిస్తుండటంతో సత్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, సర్పంచ్‌లు గొలివి వెంకటరమణమూర్తి, సుంకాన సురేష్, ఎంపీటీసీలు కోట రామారావు, రుప్ప శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: వలంటీర్లు మరింత బాధ్యతతో పని చేయాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు అన్నారు. తామాడలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. తామాడ సచివాలయం పరిధిలోని వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో తామాడ మాజీ సర్పంచ్ పాలిశెట్టి మదుబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, నాయకులు కొమ్ము సాయికుమార్, కొమ్ము సింహాద్రినాయుడు, ఎం.విజయలక్ష్మీ, ఆర్.నారాయణరావు, పాలిశెట్టి మల్లిబాబు, మారం అప్పన్న, డి.హరీష్, పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజల ముంగిటకే అన్ని రకాల సేవలు అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోసిస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. శ్రీకాకుళం నగరంలో సి.బ. రోడ్ సచివాలయంలో 13 మంది వలంటీర్లను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సాదు వైకుంఠరావు, మాధవరావు, స్పెషల్ ఆఫీసర్ చింతాడ నరేష్‌బాబు, 28వ వార్డు ఇన్‌చార్జి గుంటముక్కల పాపారావు, బొంతు నవీన్‌కుమార్, కె.ప్రేమకుమార్, చిట్టిబాబు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

27న పుస్తకావిష్కరణ సభ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళ సాహితి, సిక్కోలు బుక్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 9 గంటలకు 'నీటిగింజల పంట' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య, పుస్తకావిష్కరణకర్త ప్రముఖ కవి కె.శివారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారదర్శకంగా పథకాల అమలు



పథకాల లబ్ధిని వివరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మత, పార్టీలు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేస్తోందని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. గార మండలం గొంటి పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంచాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణమూర్తి, సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు, పీస శ్రీహరిరావు, పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ కోట రామారావు, మార్పు పృథ్వీరాజ్, కొయ్యాన నాగభూషణం, గొండు జయరాం, గొలివి వెంకటరమణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి, ముద్దాడ గోవిందరావు, రుప్ప శ్రీనివాసరావు, అంబటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు



ఎచ్చెర్ల: బాబాను దర్శించుకుంటున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: పూజలందుకుంటున్న సాయినాథుడు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలో సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా బాబాను ఊరేగించారు. అనంతరం బాబా విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి షిరిడీ తరహాలో పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలిపురంలో దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

రణస్థలం: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు బి.దుర్గారావు కోరారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుపురేషన్ కార్డు ఉన్న రైతులు 20 శాతం, లేనివారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే పశువులకు మూడేళ్ల పాటు, జీవాలకు, పందులకు రెండేళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుందని చెప్పారు. నెలలు, సంవత్సరాలు పాటు కాలయాపన చేయకుండా పశువు మరణించిన 21 రోజుల లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ అయ్యేలా నిబంధనలు పెట్టారని తెలిపారు. ఒక వేళ లబ్ధిదారుడు పశువును అమ్మితే వారం రోజుల లోగా కార్యాలయానికి తెలియజేస్తే పాలసీని కొత్త యజమానికి వర్తింపజేస్తామన్నారు. బీమా పరిహారానికి ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

విజ్ఞాన శిబిరాలతో నైపుణ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న రామ్మోహనరావు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేవి వేసవి విజ్ఞాన శిబిరాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆబోతుల రామ్మోహనరావు అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బలగ గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన, సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

జి.సిగడాం: భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు తెలిపారు. గురువారం ఆనందపురం, చీడిపేట, వాండ్రంగి గ్రామాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.